క్లుప్తంగా

వామ్ పట్టణ అధ్యక్షుడిగా శ్రీనాథ్‌గుప్తా

ఆదోని అర్బన్: వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ (వామ్) ఆదోని పట్టణ అధ్యక్షుడిగా వంకదారు శ్రీనాథ్‌గుప్తా, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మమత ప్రమాణస్వీకారం చేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కసాపురం ఆంజనేయ స్వామి ఆలయ సన్నిధిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వామ్ అంతర్జాతీయ అధ్యక్షులు టంగుటూరి రామకృష్ణ, జాతీయ అధ్యక్షురాలు జ్యోతిప్రసాద్ తమను ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయించారని శ్రీనాథగుప్తా, మమత తెలిపారు. అలాగే పట్టణ కార్యదర్శులుగా రఘు, శ్రీదేవి, కోశాధికారులుగా రంజిత్‌కుమార్, అనూషను ఎన్నుకున్నారన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న కోరారు. స్థానిక ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఏపీజీఎల్ఐ నెలవారీ కంతుల నగదు జమ కావడం లేదన్నారు. విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేక్రమంలో టెక్నికల్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. వీటన్నింటిని సరిచేయాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బి.నాగరాజు, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు రఘురామయ్య, నాయకులు మల్లికార్జున, సంగమేష్, సుదర్శన్‌రెడ్డి, తిక్కస్వామి, రాఘవేంద్ర, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో గ్యారతారీఖ్ వేడుకలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రంలోని జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం గ్యారతారీఖ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధంతో పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. భక్తులు స్వామికి పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు.

పోలీస్ కవాత్



వందగల్లులో కవాత్ నిర్వహిస్తున్న పారా మిలటరీ బృందం

కోసిగి: మండలంలోని నేలకోసిగి, కోసిగి, వందగల్లు గ్రామాల్లో ఆదివారం సెంట్రల్ పారా మిలిటరీ బృందం కవాత్ నిర్వహించారు. సెంట్రల్ ప్యారా మిలిటరీ అడిషనల్ ఎస్పీ రాకేష్ ఆధ్వర్యంలో కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్‌కుమార్ సమక్షంలో కోసిగిలోని పోలీస్ స్టేషన్ నుంచి వైఎస్సార్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, మార్కండేయ స్వామి ఆలయం, నాడుగేని వీధి మీదుగా కవాత్ నిర్వహించారు. అలాగే వందగల్లు, నేలకోసిగి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై సెంట్రల్ టీమ్ ప్రత్యేక నిఘా ఉంచిందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని ఎస్ పేరేముల గ్రామంలో లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించిన న్యూ కేటగిరీ వృషభాల రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి ప్రారంభించిన పోటీలలో విజేతలుగా తెలంగాణ రాష్ట్రం గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కురువ కర్రెప్ప వృషభాలు నిలిచి రూ.40 వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. తర్వాతి నాలుగు స్థానాలలో వరుసగా పగిడ్యాల కోవెల గిరిజ వృషభాలు, వరదాయపల్లె బెస్త శ్రీరాములు వృషభాలు, బుక్కాపురం రమేశ్, మసామసీదు రమేశ్‌నాయుడు సంయుక్త వృషభాలు, పెండేకల్ నాగభూషణ వృషభాలు నిలిచి రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు గెలుచుకున్నాయి. మరో మూడు జతల వృషభ యజమానులకు నిర్వాహకులు కన్సోలేషన్ బహుమతులందించారు.



బీసీ కాలనీకి వెళ్లే వీధి రోడ్డు (నాడు)



డ్రైనేజీ, గ్రావెల్ వేసిన తర్వాత (నేడు)

తొలగిన దారిద్ర్యం

- తోవి గ్రామంలో వీధిరోడ్లకు మోక్షం
- డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కౌతాళం: మండల పరిధిలోని తోవి గ్రామస్తుల వీధి రహదారుల కల నెరవేరింది. గత పాలకులు పట్టించుకోకపోవడంతో గ్రామంలో వీధి రోడ్లు లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేవి. వర్షాకాలంలో అయితే అడుగు తీసి అడుగు పెట్టలేని విధంగా ఉండేవి. చిన్నారులు, వృద్ధుల పరిస్థితి మరీ దారుణం. వారు వీధుల్లో నడవాలంటేనే ఎక్కడ జారి పడిపోతారోనేనంత దుర్భరంగా ఉండేవి. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అప్పటి పాలకులు కానీ, అధికారులు కానీ కనికరించలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. రూ.40 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో గ్రామంలోని వీధి రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి పైపులైన్ పనులు చేపట్టామని సర్పంచ్ నర్సమ్మ తెలిపారు. వీధిరోడ్లు, డ్రైనేజీల సమస్యల పరిష్కారం కావడంతో గ్రాస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



మెయిన్ రోడ్డుకు వెళ్లే దారిలో సిమెంట్ రోడ్డు వేస్తున్న దృశ్యం



గ్రామంలోని ఓ వీధికి వెళ్లే ప్రధాన రోడ్డు (నాడు)



గ్రావెల్, డ్రైనేజీ రోడ్డు వేసిన తర్వాత (నేడు)

8 మందిపై ఉల్లంఘన కేసు నమోదు

ఆదోని అర్బన్: ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై పట్టణంలోని 8 మందిపై శనివారం రాత్రి రిటర్నింగ్ సహాయ అధికారి హసీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ గోపీ ఆదివారం విలేకరులకు తెలిపారు. బీజేపీ అభ్యర్థి పార్థసారథి శుక్రవారం నామినేషన్‌వేసే సమయంలో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడం పట్ల పార్థసారథి, మీనాక్షినాయుడు, గుడిసె క్రిష్ణమ్మ, చంద్రమౌళితో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎల్లమ్మ దేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే



ఎల్లమ్మ దేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవిని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి పార్టీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్‌రెడ్డి, మంత్రాలయం మండల నాయకులు బాబురెడ్డితో కలిసి ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరామాలయంలో సీతారాములను దర్శించుకున్నారు.



పార్టీలో చేరిన నాయకులతో టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిక

మంత్రాలయం: మండలంలోని మాలపల్లి, వి.తిమ్మాపురం గ్రామాల టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి సమక్షంలో గ్రామ టీడీపీ నాయకుడు సత్యనారాయణరెడ్డి, రాఘవేణమ్మ, వి.తిమ్మాపురం గ్రామ టీడీపీ నాయకుడు నరసింహారెడ్డితోపాటు మరికొందరు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వై.సీతారామిరెడ్డి పార్టీ కండువాలతో ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి నాయకులు వైఎస్సార్ సీపీలోకి వస్తున్నారన్నారు.

రేపు హనుమాన్ జయంతి



పూజలందుకున్న ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్వామి వారికి తేనాభిషేకం, క్షీరాభిషేకం, ఫల పంచామృతాభిషేకం, వడలహారం, నైవేద్యం, మహా మంగళహారతితో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అనంతరం ఆలయ సన్నిధిలో పల్లకీ ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రణమండల కొండలో..

పట్టణ శివారులోని రణమండల ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ జయంతి పూజలు జరగనున్నాయి. కార్తీకమాస నిత్య ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసిహారం, వడలహారం, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు.

స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల పరిశీలన

ఆదోని రూరల్: స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను నియోజక వర్గ ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదివారం పరిశీలించారు. పోలింగ్ ముందు రోజున ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేయాల్సిన వస్తువులను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, మండల సర్వేయర్ రమణ ఉన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ తనిఖీ..

కమాండ్ కంట్రో రూమ్‌ను సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణపై ఏమైనా సందేహాలు ఉంటే కమాండ్ కంట్రోల్ రూమ్ నం.08512 252339కు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. అనంతరం సిరుగుప్ప క్రాస్ రోడ్డు, ధణాపురం చెక్‌పోస్టు సమీపంలో ఏర్పాటు చేసిన స్టాటిటిక్స్ సర్వేలెన్స్ బృందాల పనితీరును తనిఖీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని బృందాలకు ఆయన సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

కవిత్వం వస్తువు వైవిధ్యంగా ఉండాలి

కర్నూలు కల్చరల్: కవిత్వం వస్తువు వైవిధ్యంగా ఉండాలని ప్రముఖ కవి అనిల్ డానీ అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో రాయలసీమ ప్రచురణలు ఆధ్వర్యంలో తెలుగు వెంకటేష్ రచించిన 'రెయిన్ కేఫ్' పుస్తకావిష్కరణ జరిగింది. విజయవాడకు చెందిన ప్రముఖ కవి బండ్ల మాధవరావు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ డానీ మాట్లాడుతూ వాన కన్నీళ్లు తాగి మన బతుకుతున్నామని, మనిషి జీవనాన్ని వానతో ముడిపెట్టి చెప్పటం గొప్ప కవిత్వ పదచిత్రానికి నిదర్శనమన్నారు. కవి కవిత్వం ద్వారా జీవన తాత్వికతను చెప్పారన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు, కథా రచయిత మారుతి పౌరోహితం మాట్లాడారు. కార్యక్రమంలో కవులు రచయితలు మహమ్మద్ మియ్యా, ఇనాయతుల్లా, పాణి, సారథి, కల్యాణ దుర్గం స్వర్ణలత, అజీజ్, జంధ్యాల రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

ఊపందుకున్న ఇంటింటా ప్రచారం



సిద్దప్ప పాలెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కడపాలెంలో ప్రచారం చేస్తున్న ఉరుకుంద ట్రస్ట్‌బోర్డు మెంబర్ నరసింహులు

కోసిగి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ఆదివారం మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కోసిగి సిద్దప్ప పాలెంలో నాయకులు గానిగి వీరస్వామి, ముకుంద కృష్ణమూర్తి, కొరివి నాగరాజు, కడపాలెంలో ఉరుకుంద ట్రస్ట్ బోర్డు మెంబర్ బుళ్లి నరసింహులు, వెంకటేష్‌లు ప్రచారం చేశారు. కోసిగి అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే బాలనాగిరెడ్డిని మరోసారి గెలిపించుకోవాలన్నారు.

పిల్లలకు నైతిక విలువలు నేర్పించాలి

కర్నూలు కల్చరల్: తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న తనం నుంచే నైతిక విలువలు నేర్పించాలని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమం జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. సంధ్యా హారతి, తులసి హారతి, రాజభోగ నివేదన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భగవద్గీతను పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణానికి భగవద్గీత మార్గదర్శనం చేస్తుందన్నారు. అనంతరం హరే కృష్ణ హరే రామ నామ జపం సామూహికంగా పటించారు.

పారా రోయింగ్ విజేత భారత్



విజేతగా నిలిచిన వెంకటనారాయణ, అనిత

ప్యాపిలి: సౌత్ కొరియాలో జరిగిన పారా రోయింగ్‌లో భారత్ విజేతగా నిలిచింది. ఈ నెల 19 నుంచి 21 వరకు సౌత్ కొరియాలో జరిగిన పారా ఒలంపిక్స్ క్వాలిఫై రగాటా పోటీల్లో రాజస్థాన్‌కు చెందిన అనితాతో కలసి ప్యాపిలికి చెందిన వెంకటనారాయణ భారత్ తరపున తలపడ్డాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో వీరి ద్వయం రెండు కిలోమీటర్ల దూరాన్ని 7.50 నిమిషాల్లో చేరుకుని మొదటి స్థానంలో నిలిచారు. భారత్‌తో పాటు థాయ్‌లాండ్, కొరియా, కజకిస్తాన్, జపాన్, హాంకాంగ్ తదితర దేశాలు తలపడిన ఈ పోటీల్లో భారత్ విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో విజయం సాధించడంతో ఈ ఏడాది పారిస్‌లో జరిగే పారా ఒలంపిక్ పోటీలకు అర్హత సాధించినట్లు వెంకటనారాయణ తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో రోడ్డు పక్కనే ఉన్న దర్గా కట్ట వద్ద కూర్చొని ఉన్న ఇద్దరు వ్యక్తులను కారు ఢీకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. పైగేరి ఈరన్న, గౌస్ పీరా రోడ్డు పక్కన కూర్చొని ఉన్నారు. ఒక్కసారిగి కారు వారిపైకి దూసుకొచ్చింది. ప్రమాదంలో ఇద్దరి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కర్నూలుకు తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన కారు కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిందని, ఓ శుభకార్యం నిమిత్తం వచ్చిన వారు మద్యం మత్తులో ఉండి ఢీకొట్టారని సమాచారం. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సతీష్‌కుమార్ పరిశీలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

24న బండలాగుడు పోటీలు

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో అవధూత పక్కీరప్ప స్వామి రథోత్సవం సందర్భంగా 24వ తేదీ ఉదయం 8 గంటలకు రాష్ట్రస్థాయి దేశం, కిలారి ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ విజయుడు, గ్రామస్తులు ఆదివారం తెలిపారు. పోటీలలో విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వృషభాల యజమానులు 97010 90928, 90520 32913 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి

దేవనకొండ: రాష్ట్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు సాయిప్రసాద్ రెడ్డి, బాలనాగి రెడ్డి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించాలని కోరుకుంటూ వారు ఆదివారం మండలంలోని కప్పట్రాళ్ల ఫారెస్ట్‌లో వెలిసిన కొలుట్ల చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. 2019లో టీడీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడి రామరాజ్య పాలన తెచ్చుకున్నామన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించి రామరాజ్య పాలన కొనసాగించాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసగించేందుకు చూస్తున్నారని, ఆయన మాటలను నమ్మే పరిస్థితుల్లో జనాలు లేరని చెప్పారు. పార్టీలకు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందని, మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పండితులు చల్లా బంగారయ్య, చల్లా మురళి, విద్యాధర్‌స్వామి, వెంకటేశ్వర్లు, కొలుట్ల, లక్ష్మన్న స్వామి తదితరులు ఉన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: విద్యార్థులు ఉత్తమ సమాజ పౌరులుగా ఎదగాలని పలువురు వక్తలు, ధార్మిక సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారపేట కేశవ మెమోరియల్ పాఠశాలలో ఆదివారం గుమ్మితం తాండ, కన్నమడకల, డి.బెళగల్, కుంకనూరులలోని బాల వికాస పాఠశాలల జిల్లా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బాల వికాస పాఠశాలల ద్వారా గ్రామాల్లో చైతన్యం తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకున్నాయి. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.డి.వి.జోగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కర్నూలు ఇస్కాన్ మందిరం ప్రవచకులు రఘునందన సేవక ప్రభు, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం, బొమ్మిరెడ్డి పల్లె శ్రీ భీమ లింగేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్త పూడూరు లక్ష్మీరెడ్డి, వెల్దుర్తి హనుమాన్ జంక్షన్ వ్యవస్థాపకులు రామాంజనేయులు స్వామి సందేశమిచ్చారు. సమరసత ఫౌండేషన్ ప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.